

పాల్వంచ ప్రభుత్వ దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

# వేతనాల కోసం కాంట్రాక్టు కార్మికుల ధర్నా

**పెండింగ్ జీతాలు చెల్లించకుంటే సమ్మె చేస్తామని నోటీసు**

పాల్వంచ, మార్చి 29 : పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ప్రభుత్వ దవాఖానలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం దవాఖాన ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు బండి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నెలనెలా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పుడు కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పిందని మండిపడ్డారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ప్రతి నెలా వేతనాలు వచ్చేలా చూడాలని కోరారు. ఏప్రిల్ ఒకటో తేదీన వేతనాలు ఇవ్వకపోతే సమ్మెకు దిగుతామని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దవాఖాన అధికారులకు నోటీసు అందజేశారు.

# మన్మాడ్-ముద్కేడ్ విద్యుద్దీకరణ పనులు పూర్తి

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వేజోన్ ఆధ్వర్యంలో మమ్మాడ్, ముద్కేడ్, డోన్ తదితర రైల్వేస్టేషన్ల మధ్య వంద శాతం విద్యుద్దీకరణ పనులను పూర్తి చేసినట్టు శుక్రవారం రైల్వే అధికారులు వెల్లడించారు. మన్మడ్-ముద్కేడ్ మధ్య మొత్తం 43 కిలోమీటర్ల మేర ఈ పనులు పూర్తయ్యాయని తెలిపారు. నడికుడి-శ్రీకాళహస్తి మధ్య కొనసాగుతున్న నూతన రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా గుండ్లకమ్మ-దర్శి మధ్య పనులు కూడా పూర్తయ్యాయని వారు తెలిపారు.

# రికార్డుస్థాయిలో విద్యుత్తు వినియోగం

- మండే ఎండలతో పెరుగుతున్న డిమాండ్
- మే నెల రికార్డులు మార్చిలోనే బద్దలు
- హైదరాబాద్‌లోనూ అత్యధిక వాడకం

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): మండేఎండలతో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు వినియోగం రికార్డుస్థాయిలో పెరుగుతున్నది. మే నెలలో నమోదయ్యే రికార్డుస్థాయి వాడకం మార్చి నెలలోనే నమోదవడం గమనార్హం. శుక్రవారం ఒక్కరోజే రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 289.697 మిలియన్ యూనిట్లకు చేరింది. నిరుడు మార్చి చివరి వారంలో నమోదైన రికార్డు ఈ ఏడు మార్చి మొదటి వారంలోనే బద్దలైంది. నిరుడు మార్చి 30న రాష్ట్రంలో 15,497 మెగావాట్లు ఉండగా, ఈ ఏడాది మార్చి 8వ తేదీనే 15,623 మెగావాట్లతో ఆ రికార్డునే అధిగమించింది. ఈ ఏడాది మార్చి 14న 308.54 మిలియన్ యూనిట్లతో అత్యధిక విద్యుత్తు వినియోగం నమోదైంది. ఎండలు మండుతుండటం, వరుసగా సెలవుల కారణంగా అంతా ఇంటిపట్టునే ఉండటంతో పట్టణ ప్రాంతాల్లో వినియోగం అమాంతం పెరుగుతున్నది. గ్రేటర్ హైదరాబాద్‌లోనే 15 శాతం డొమెస్టిక్ విద్యుత్తు వినియోగం పెరిగింది. గ్రేటర్‌లో వినియోగదారుల సంఖ్య పెరుగుదలతో విద్యుత్తు డిమాండ్ మరింతగా పెరిగింది.



**రాష్ట్రంలో వారం రోజుల్లో నమోదైన విద్యుత్తు వాడకం వివరాలు**

| తేదీ | మిలియన్ యూనిట్లు | మెగావాట్లు |
|---|---|---|
| 28-3-24 | 289.697 | 14277 |
| 27-3-24 | 286.524 | 13982 |
| 26-3-24 | 282.221 | 14064 |
| 25-3-24 | 272.864 | 13542 |
| 24-3-24 | 279.015 | 13769 |
| 24-3-24 | 287.055 | 14160 |
| 23-3-24 | 287.055 | 14233 |

### వ్యవసాయానికీ పెరిగిన డిమాండ్

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికీ విద్యుత్తు డిమాండ్ సైతం పెరిగింది. చెరువులు, వాగులు ఎండిపోయాయి. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులంతా బోర్లు, బావుల మీదున్న విద్యుత్తు మోటర్లపై ఆధారపడుతున్నారు. దీంతో వ్యవసాయానికి సరఫరా అవుతున్న విద్యుత్తు 2-5 శాతం పెరిగింది. దీంతో రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాపై డేంజర్‌బెల్స్ మోగుతున్నాయి. ఎండలు మరింతగా పెరిగితే డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్తు అందుతుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విద్యుత్తు డిమాండ్, సరఫరా తీరుపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

### గ్రేటర్ హైదరాబాద్‌లో రికార్డుల నమోదు

దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్తు వినియోగం రికార్డులనే తిరగరాస్తున్నది. నిరుడు మే 19న 79.33 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగంతో రికార్డు నమోదైంది. గత గురువారం ఒక్క గ్రేటర్‌లోనే 79.48 మిలియన్ యూనిట్ల రికార్డుస్థాయి విద్యుత్తు వినియోగం నమోదు కావడం గమనార్హం. నిరుడు మార్చిలో గ్రేటర్ అత్యధిక విద్యుత్తు వినియోగం 67.97 మిలియన్ యూనిట్లు మాత్రమే. మార్చి నెల సరాసరి విద్యుత్తు వినియోగం 57.84 మిలియన్ యూనిట్లు. ఈ ఏడాది మార్చి వరకు సరాసరి విద్యుత్తు వినియోగం 70.96 మిలియన్ యూనిట్లకు చేరనున్నది. దీంతో దాదాపు 22.7 శాతం పెరుగుదల నమోదైంది. 15 జిల్లాలతో కూడిన టీఎస్ఎస్పీడీసీఎల్ పరిధిలో పరిశీలిస్తే 2023 మార్చి 3న 188.60 మిలియన్ యూనిట్లు వినియోగం కాగా, ఈ ఏడాది మార్చి 13న గరిష్ఠంగా 202.45 మిలియన్ యూనిట్లుగా నమోదైంది.

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 43.1°c | 22.0°c |
| నల్లగొండ | 42.0°c | 29.0°c |
| మెదక్ | 41.9°c | 21.3°c |
| రంగారెడ్డి | 41.7°c | 19.1°c |
| మహబూబ్‌నగర్ | 40.5°c | 25.6°c |
| హైదరాబాద్ | 40.2°c | 25.4°c |
| ఖమ్మం | 40.0°c | 24.0°c |
| నిజామాబాద్ | 39.9°c | 26.0°c |
| వరంగల్ | 39.0°c | 27.0°c |
| కరీంనగర్ | 39.0°c | 27.0°c |

### రాష్ట్రంలో దారెత్తిస్తున్న ఎండలు

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు దారెత్తిస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోయాయి. సాధారణంతో పోలిస్తే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. రాబోయే 3 రోజులు వడగాలుల తీవ్రత పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ శాఖ డైరెక్టర్ డాక్టర్ నాగరత్న హెచ్చరించారు. ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడే అవకాశం కనిపిస్తున్నదని, వచ్చే రెండు నెలలు ఎండలు మరింత తీవ్రం కావచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతున్నట్టు వాతావరణ శాఖ వెల్లడించారు. ఏప్రిల్, మే నెలల ఉష్ణోగ్రతల అంచనాలను ఏప్రిల్ 1న విడుదల చేస్తామని తెలిపారు.

# కుమ్మరికుంట్ల తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

- గ్రామాన్ని సందర్శించిన అధికారులు
- 'నమస్తే' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

దంతాలపల్లి, మార్చి 29 : మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తాగునీటి కోసం స్థానికులు ఖాళీబిందెలతో ఆందోళన చేసిన విషయమై శుక్రవారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో 'తాగునీటికి యాతన' శీర్షికన ప్రచురితమైన కథనానికి మిషన్ భగీరథ ఈఈ కృష్ణారెడ్డి, డీపీవో హరిప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అనూష స్పందించి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి సమస్యపై అధికారులు ఆరా తీయగా గతంలో మిషన్ భగీరథ నీరు బాగానే వచ్చేదని, ఇప్పుడు సరిగ్గా రావడం లేదని గ్రామస్థులు తెలిపారు. 20 రోజులుగా తమ ఏరియాకు చుక్కనీరు రావడం లేదని తెలుపగా వెంటనే మిషన్ భగీరథ నీటి విడుదల శాతాన్ని పెంచి తాగునీటి సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. తక్షణమే గ్రామంలో ఉన్న బోర్లకు మోటర్లను ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.



కుమ్మరికుంట్ల గ్రామంలో పర్యటించి నీటి కొరతపై ఆరా తీస్తున్న అధికారులు

# దాహార్తితో వన్యప్రాణుల తండ్లాట

- అమ్రాబాద్ అడవుల పరిధిలో అటవీ జంతువుల గోస
- దాహార్తిని తీర్చుకునేందుకు జనారణ్యంలోకి..
- ప్రజలపై దాడుల ముప్పు.. పొంచిఉన్న వేటగాళ్ల ఉచ్చు
- 78 లక్షలకు అటవీశాఖ ప్రతిపాదనలు.. అందని నిధులు

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): అమ్రాబాద్ ఫారెస్ట్ రిజర్వ్ (ఏటీఆర్) అటవీ ప్రాంతాల్లో తాగునీటి కోసం వన్యప్రాణులు తండ్లాడుతున్నాయి. దంచికొడుతున్న ఎండలకు తోడు అడవిలో ఎగిసిపడుతున్న మంటలు, తగ్గిన భూగర్భజలాల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. నిరుడు అంతంతమాత్రంగా కురిసిన వర్షాలు, ప్రస్తుతం పెరిగిన ఉష్ణోగ్రతలతో అడవుల్లోని నీటి వనరులు ఎండిపోతున్నాయి. దాహార్తిని తీర్చుకునేందుకు గ్రామాలకు వస్తున్న వన్యప్రాణులు ప్రజలపై దాడికి పాల్పడి గాయపర్చడమే కాకుండా వేటగాళ్ల ఉచ్చులో చిక్కి మృత్యువాత పడుతున్నాయి. ఈ క్రమంలో వన్యప్రాణుల తాగునీటి సౌకర్యాల కల్పనకు అటవీశాఖ అధికారులు రూ.78 లక్షల నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. రెండేండ్లుగా కంపా నిధులు రాకపోవడంతో ఉన్న నిధులతో వారు నెట్టుకొస్తున్నారు. టూరిజం ఫండ్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తున్నా, పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం కావడం లేదు.

### 10 వేలకు పైగా వన్యప్రాణులు

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) 2611.4 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నేషనల్ టైగర్ కన్జర్వేటర్ (ఎన్టీసీఏ) అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం 32 పులులు, 176 చిరుత పులులు, 250 ఎలుగు బంట్లు, 10 వేలకు పైగా ఇతర వన్యప్రాణులు ఉన్నాయి. వీటితోపాటు వివిధ రకాల పక్షులు, సరీసృపాలు, కీటకాలు, ఆయుర్వేద మొక్కలు, అరుదైన వృక్షసంపద ఉన్నది. కృష్ణా నది సరిహద్దులో ఉండటంతో ఏటీఆర్‌లోకి ఇతర ప్రాంతాల నుంచి పక్షులు, జంతువులు వలస వస్తుంటాయి. ప్రతి ఏటా వన్యప్రాణుల సంతతి గణనీయంగా అభివృద్ధి చెందుతున్నది. నీటి సమస్యతో వలసొచ్చే వన్యప్రాణులకు కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

### వన్యప్రాణుల మృత్యువాత

అడవిలో తరచూ ఎగిసిపడే మంటలతో వన్యప్రాణులు తమ ఆవాసాలను కోల్పోతున్నాయి. ఈ దశలో పరిగెత్తే సమయంలో గాయాలపాలవడంతో వాటిని మృత్యువు కబలిస్తున్నది. కొత్త ఆవాసాల్లో నీటి వనరులు దొరకక చనిపోతున్నాయి. అడవిలో నీళ్లు లేక గ్రామాల్లోకి, సమీప పంట పొలాల్లోకి రావడంతో వేటగాళ్లు వాటిని చంపుతున్నారు. అలాగే పంటలను కాపాడుకునేందుకు కొందరు రైతులు కరెంట్ వైర్లు పెట్టడం, ఉచ్చులు బిగించడంతో వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల ఐసీఐసీఐ ఫౌండేషన్ 5 ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకులు అందించింది. వీటి ద్వారా కొన్ని రేంజ్‌ల పరిధిలో నీటి సరఫరా చేస్తున్నారు.

**సాసర్ పిట్స్ మరమ్మతుకు ఆదేశాలిచ్చాం**

అడవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. సహజ నీటి వనరుల వద్ద సోలార్ పంప్‌సెట్స్ ఏర్పాటు చేశాం. సాసర్ పిట్స్ మరమ్మతులు చేయాలని ఎఫ్ఆర్వోలకు సూచనలు ఇచ్చాం. టూరిజం ఫండ్స్‌తో ఏర్పాట్లు చేస్తున్నాం. వేటగాళ్ల నియంత్రణపై దృష్టి పెట్టాం. వేటాడితే కఠినంగా వ్యవహరిస్తాం. వన్యప్రాణులు దాడి చేస్తే నష్టపరిహారం అందిస్తున్నాం.

- రోహిత్ గోపిడి, డీఎఫ్‌వో, అమ్రాబాద్

**కాంగ్రెస్‌కు టచ్‌లో 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు: కోమటిరెడ్డి**

హైదరాబాద్, మార్చి 29(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్‌కు చెందిన 30 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. వారు ఏ క్షణమైనా తమ పార్టీలో చేరతారని పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. తమ పార్టీలో సీఎం అయినా, మంత్రులైనా ఒక్కటేనని, ఎవరిపైనా మరొకరి పెత్తనం ఉండదని వ్యాఖ్యానించారు. తన తమ్ముడు, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితో విభేదాలు లేవని, చిన్నచిన్న గొడవలు ఉంటాయని చెప్పారు. తమ పెద్దన్న కొడుకు ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసిన విషయం తెలియగానే వద్దని చెప్పానని తెలిపారు. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా ఎంపీగా పోటీ చేయడం కష్టమని అధిష్ఠానం చెప్తున్నదని వెల్లడించారు. తాను తన మంత్రిత్వ శాఖను, నియోజకవర్గ పనులనే చూసుకుంటున్నానని, ఇతర వ్యవహారాలను పెద్దగా పట్టించుకోవడం లేదని చెప్పారు. లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 సీట్లు గెలుచుకుంటుందని చెప్పారు.

# దానం నాగేందర్‌కు 'హ్యాండ్'?

- సికింద్రాబాద్ టికెట్‌పై కాంగ్రెస్ పునరాలోచన
- తెరపైకి మళ్లీ బొంతు రామ్మోహన్
- రాజీనామా అసలు కారణం కాదు
- సర్వేలో బొంతే బెటర్ అని నివేదిక?



హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హ్యాండ్ ఇచ్చే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తే గానీ ఎంపీగా పోటీ చేయొద్దని అధిష్ఠానం మెలిక పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. కానీ వాస్తవానికి అది కారణమే కాదని, కాంగ్రెస్ తాజాగా నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో దానం నాగేందర్ అభ్యర్థిత్వానికి కంటే మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కే ఓటర్లు అనుకూలంగా ఉన్నట్టు తేలిందని ఆయా వర్గాల సమాచారం. ఈ విషయాన్ని అధిష్ఠాన పెద్దలు బయటికి చెప్పకుండా, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే ఎంపీగా పోటీ చేయాలని దానం నాగేందర్‌కు కండిషన్ పెట్టినట్టు తెలిసింది. ఎంపీగా పోటీ చేసి గెలిచాకే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కాంగ్రెస్ పెద్దలు అంగీకరించాకే పార్టీ కండువా కప్పుకున్నానని, ఇప్పుడేమో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని షరతు పెట్టడమేంటని దానం నాగేందర్ మొండికేస్తున్నట్టు సమాచారం. ఇదే కారణంతో సికింద్రాబాద్‌కు అభ్యర్థిని మారుస్తారనే ప్రచారం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### శ్రీహరి, కావ్యకు ఆహ్వానం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని తమ పార్టీలో చేరాలని కాంగ్రెస్ పార్టీ నేతల బృందం ఆహ్వానించింది. ఆ బృందం ఆయన ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనను కలిసింది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులతోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లు రవి శుక్రవారం కడియం శ్రీహరి ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. బీఆర్ఎస్ నుంచి వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీకి నిరాకరించిన కడియం శ్రీహరి కుతూరు కావ్య కూడా అక్కడే ఉన్నారు. ఈ నేపథ్యంలో తండ్రి, కూతురిలో ఎవరైనా ఒకరు కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఏఐసీసీ తరపున కడియం శ్రీహరి, కావ్యను తమ పార్టీలో చేరాల్సిందిగా కోరినట్టు దీపాదాస్ మున్షీ అనంతరం మీడియాకు వెల్లడించారు. తన అనుచరులతో చర్చించి రెండు రోజుల్లో తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని ఈ సందర్భంగా కడియం శ్రీహరి తెలిపారు.

## దానంపై అనర్హత వేటు వేయాలి

**హైకోర్టులో పిటిషన్ దాఖలు**

హైదరాబాద్, మార్చి 29, (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా అధికార పార్టీలో చేరిన ఆయనపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఆ నియోజకవర్గ ఓటరు బీ రాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. బీఆర్ఎస్ తరపున ఎన్నికైన దానం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లోకి చేరి పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ నేపథ్యంలో ఆయనపై అనర్హత వేటు వేయాలంటూ మెయిల్ ద్వారా స్పీకర్‌కు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. దీంతో ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలని పిటిషన్ దాఖలు చేసే అర్హత పిటిషనర్‌కు ఉన్న దా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడంపై ఏమైనా తీర్పులుంటే సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేశారు.

## విద్యా - ఉద్యోగ సమాచారం

### ఏప్రిల్ ఆఖరులో సీయూఈటీ-పీజీ ఫలితాలు

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : సీయూఈటీ - పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు ఏప్రిల్ నెలాఖరులో విడుదల చేయనున్నట్టు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ మామిడాల జగదీశ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 11 నుంచి 28 వరకు పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. మొత్తం 4,62, 603 మంది అభ్యర్థులకు 7,68,414 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారని వివరించారు.

### రేపటితో ముగియనున్న 'పది' ప్రధాన పరీక్షలు

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : పదోతరగతి పరీక్షలు చివరి అంకానికి చేరుకున్నాయి. శనివారం సాంఘికశాస్త్రం పేపర్‌కు పరీక్ష నిర్వహిస్తారు. దీంతో ప్రధాన పరీక్షలు ముగుస్తాయి. ఏప్రిల్ 1న ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -1, ఏప్రిల్ 2న ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ -2 పేపర్లకు పరీక్షలు జరుగుతాయి.

### కేవీల్లో ప్రీ ప్రైమరీ దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా కేంద్రీయ విద్యాలయాల్లో పూర్వ ప్రాథమిక విద్యలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. బాలవాటిక -1, బాలవాటిక -2, బాలవాటిక -3 (1వ తరగతి కంటే ముందు) తరగతుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. మార్చి 31 నాటికి మూడేండ్లు పైబడి, ఆరేండ్ల లోపు వయసు ఉన్న చిన్నారుల ప్రవేశాలకు ఏప్రిల్ 1 నుంచి 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) తెలిపింది. కేవీల్లో ఒకటో తరగతి, బాలవాటికల్లోనూ ప్రవేశాలకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. రిజిస్ట్రేషన్లు, ప్రవేశాల ప్రక్రియ ఆఫ్‌లైన్‌లో నిర్వహించనున్నారు.

### 'పెండింగ్ పీఈటీ పోస్టులను భర్తీ చేయాలి'

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : పెండింగ్‌లో ఉన్న పీఈటీ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టి, తమకు న్యాయం చేయాలని పలువురు బాధిత అభ్యర్థులు టీఎస్‌పీఎస్సీని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడుల్లో పీఈటీ ఉద్యోగాల నియామక ప్రక్రియ 2017లో ప్రారంభించినా నేటి వరకు పూర్తి కాలేదని తెలిపారు. వాస్తవానికి గత ఏడాదిలోనే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందు వల్ల వాటి ఫలితాలు గత ప్రభుత్వం విడుదల చేయలేదని చెప్పారు. పీఈటీ పోస్టుల భర్తీ నేపథ్యంలో డీపీఎడ్, బీపీఎడ్ విద్యార్హతల విషయంలో కొంత వివాదం నెలకొన్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టులో కేసు దాఖలైందని చెప్పారు. కోర్టు తీర్పు ప్రకారం 1 నుంచి 5 తరగతులకు డీపీఎడ్ అభ్యర్థులకు, 6 నుంచి 10 వరకు బీపీఎడ్ అభ్యర్థులకు, 5 నుంచి 8వ తరగతి వరకు రెండు రకాల విద్యార్హతలు ఉన్న వారికి అర్హులని హైకోర్టు తీర్పు చెప్పింది.

### నేడే టీహబ్‌లో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు జేబీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్వెంటర్స్ అసోసియేషన్.. టీ హబ్‌లో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ ఉదయం 11 గంటలకు ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

### గెస్ట్ లెక్చరర్లను కంటిన్యూ చేయాలి: టీఎస్డీఎల్ఏ

రవీంద్రభారతి,మార్చి29 : గెస్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న తమను రెన్యువల్ సర్వీస్‌తో కంటిన్యూ చేయాలని తెలంగాణ రాష్ట్ర డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్ (టీఎస్డీఎల్ఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పీరియడ్ విధానాన్ని రద్దు చేసి 12 నెలలకు కన్సాలిడేటెడ్ పే ఇవ్వాలని కోరింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కొర్ర ఈశ్వర్‌లాల్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దాదాపు 50% నుంచి 70% వరకు గెస్ట్ లెక్చరర్ల సేవలపైనే పనిచేస్తున్నాయని తెలిపారు. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 300కుపైగా గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రెగ్యులర్, కాంట్రాక్ట్ వారితో సమానంగా విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని యూజీసీ 2012లో ఇచ్చిన గైడెన్స్ అమలు చేయడం లేదని చెప్పారు. డిగ్రీ కళాశాల లెక్చరర్లకు 50వేల కన్సాలిడేటెడ్ పే ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఈశ్వర్‌లాల్ డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు ఖాజా, రాకేశ్ రెడ్డి, ప్రభాకర్, శివుడు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మెజారిటీ సీట్లు గెలవాలి

- ఏప్రిల్ 6న తుక్కుగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ బహిరంగసభ
- ఈ సభలోనే కాంగ్రెస్ ఐదు న్యాయ్ గ్యారెంటీల ప్రకటన
- కష్టపడి పనిచేసిన నేతలకు సముచిత స్థానం కల్పిస్తాం
- పీసీసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,మార్చి 29 (నమస్తే తెలంగాణ): ప్రజల్లో మంచి స్పందన ఉంది.. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు గెలువాలని పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల వ్యూహం, ఏప్రిల్ 6న తుక్కుగూడలో జరుగునున్న కాంగ్రెస్ జన జాతర సభ ఏర్పాట్లపై పార్టీ నేతలకు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సభకు రాజీవ్‌గాంధీ ప్రాంగణంగా, జనజాతరగా నామకరణం చేశామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇదే సభలో కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల జాతీయ మ్యానిఫెస్టోను విడుదల చేస్తామని, ఇందులో ప్రకటించబోయే ఐదు న్యాయ్ గ్యారెంటీలపై విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ మ్యానిఫెస్టోలో తెలంగాణ పెండింగ్ హామీలనూ చేరుస్తామని ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే కొందరికి నామినేటెడ్ పదవులు ఇచ్చామని, పార్టీ అన్ని అనుబంధ సంఘాల చైర్మన్లకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలు, సలహాదారులు, నామినేటెడ్ పోస్టులు పొందిన నేతలను అభినందిస్తూ సమావేశం తీర్మానం చేసింది. మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో మ్యానిఫెస్టో కమిటీకి సలహాలు, సూచనలు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జులను నియమించి ఎన్నికల ప్రచారం చేపట్టాలని సూచించారు. దేశంలో తెలంగాణ మోడల్ పాలన బాగుందని పార్టీ జాతీయ నాయకత్వం కితాబు ఇవ్వడం గర్వకారణమని, ఇది సమిష్టి కృషి వల్లనే సాధ్యమైందని తెలిపారు.

### తుక్కుగూడ సభలో కాంగ్రెస్ జాతీయ మ్యానిఫెస్టో : భట్టి

రంగారెడ్డి జిల్లా పరిధిలోని తుక్కుగూడలో ఏప్రిల్ 6న నిర్వహించే బహిరంగసభలో కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన పీసీసీ కార్యవర్గ సమావేశంలో చర్చించిన విషయాలను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీతో కలిసి కలిసి మీడియాకు వివరించారు. ఈ సమావేశంలో వందరోజుల ప్రభుత్వ పాలనపై చర్చించామని, అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలిచే వ్యూహంపై చర్చించామని భట్టి వివరించారు. తమ ప్రభుత్వం చేసిన పనులు, చేపట్టబోయే విషయాలను సభలో ప్రజలకు వివరిస్తామని తెలిపారు. తెలంగాణను ఒక మోడల్‌గా తీసుకువెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిందని చెప్పారు. ఎర్రకోటపై కాంగ్రెస్ జెండా ఎగరేయడానికి తుక్కుగూడ సభ నాందిగా భావిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను దేశవ్యాప్తంగా ప్రశంసిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని గుర్తించకపోగా, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. పంట నష్టంపై నివేదిక రాగానే రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఐదారు నెలలపాటు రైతుబంధు సాయం వేసేదని, తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే రైతుబంధు వేయడం లేదని విమర్శించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్లి పంటలను పరిశీలించినా తమకు కానీ, రైతులకు గానీ ఒరిగేదేమీ లేదని మంత్రి తుమ్మల విమర్శించారు.

# నన్ను బలహీనపరిచే కుట్రలు

- పాలమూరులో దొంగదెబ్బ తీసేందుకు ఏకమవుతున్న బీజేపీ, బీఆర్ఎస్
- డీకే అరుణ జిల్లాకు చేసిందేమిటి?
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో 200 ఓట్ల మెజార్టీతో గెలుస్తాం
- ఫోన్‌ట్యాపింగ్ బాధ్యులు జైలుకే
- వాల్మీకి బోయల సభలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను ఓడించి రాజకీయంగా తనను బలహీనపరిచే కుట్ర జరుగుతున్నదని పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక బీఆర్ఎస్, బీజేపీ ఏకమై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీసేందుకు కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. ఈ జిల్లాలో కాంగ్రెస్‌ను ఓడించాలనేది అభ్యర్థుల మీద కోపంతో కాదని, తనను రాజకీయంగా దెబ్బతీసేందుకేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ గెలిస్తే మేలు జరుగుతుందో, బీజేపీ గెలిస్తే మంచి జరుగుతుందో ప్రజలు ఆలోచించాలని కోరారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో వాల్మీకి బోయలను ఉద్దేశించి మాట్లాడుతూ.. పదేండ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వల్ల మహబూబ్‌నగర్‌కు ఒక్కటంటే ఒక్క మేలు జరిగిందా? అని ప్రశ్నించారు. బీజేపీలో జాతీయ పదవి తెచ్చుకున్న డీకే అరుణ.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా ఎందుకు తీసుకొనిరాలేదని నిలదీశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేత డీకే అరుణ ఆర్డీఎస్ ద్వారా కర్ణాటక నుంచి నీళ్లు తెచ్చారా? తుమ్మిళ్ల ప్రాజెక్టు పూర్తి చేశారా? అని ప్రశ్నించారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే ఒరిగేది ఏమిలేదని చెప్పారు. పదేండ్లలో మోదీ వల్ల జిల్లాకు ఏమైనా మేలు జరిగిందా? ఏదైనా పథకం వచ్చిందా? అని ఆలోచించాలని విజ్ఞప్తిచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ గూడుపుఠాని చేయకపోతే అలంపూర్, గద్వాలలో కూడా కాంగ్రెస్ గెలిచేదని చెప్పారు. ప్రభుత్వాన్ని చూసి ప్రజలు భయపడే పరిస్థితి రాకూడదని వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రెండు వందల ఓట్ల మెజార్టీతో గెలువబోతున్నదని ధీమా వ్యక్తంచేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు కారకులైనవారికి చర్లపల్లి జైలు తప్పదని హెచ్చరించారు. తమ ప్రభుత్వం వాల్మీకి బోయల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిశాక వాల్మీకి బోయల సంక్షేమం, అభివృద్ధి, విద్యలో సముచిత స్థానం కల్పించే బాధ్య తను తీసుకుంటామని హామీ ఇచ్చారు.